సేవలకు బంక్ కొడితే ప్రశ్నించవచ్చు

- ఉచిత సేవలపై అవగాహన అవసరం
- మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం తప్పనిసరి

రావులపాలెం: ఎప్పటికప్పుడు పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్యులపై పెనుభారం అవుతున్నాయి. ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధరలు సెంచరీ దాటాయి. వీటి ధరలు పెరిగినప్పుడల్లా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే పన్నులపై ప్రజల్లో చర్చ సాగుతూ ఉంటుంది. ప్రతి లీటర్‌పై వ్యాట్ రూపంలో చెల్లిస్తున్న రుసుముతో వినియోగదారులకు బంకుల్లో యజమానులు కొన్ని కనీస సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ఈ సౌకర్యాల గురించి చాలా మందికి తెలియదు. ఒకరిద్దరు నిబంధనల గురించి ప్రశ్నిస్తే నిర్వాహకులు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారనే విమర్శలు ఉన్నాయి. పెట్రోల్ బంకుల వద్ద వినియోగదారులకు సదుపాయాలు కల్పించకపోతే ఫిర్యాదు చేయవచ్చు. జిల్లాలో చాలా పెట్రోల్ బంక్‌ల్లో ఈ సేవలు కానరావడం లేదు. కొన్ని బంక్‌ల్లో టాయిలెట్‌లకు తాళాలు వేసి ఉంటున్నాయి. మరికొన్ని చోట్ల టైర్లలో గాలి నింపే యంత్రాలు పనిచేయడం లేదు. పెట్రోల్ కొట్టించుకున్న తరువాత గాలి పెట్టించుకోవాలంటే సిబ్బంది లేరని సమాధానం చెబుతున్నారు.

స్వచ్ఛమైన తాగునీరు

కోనసీమ జిల్లాలో వివిధ కంపెనీలకు చెందిన సుమారు 193 పెట్రోల్ బంక్‌లు ఉన్నాయి. రావులపాలెం మండలంలో సుమారు 15 పెట్రోల్ బంక్‌లు ఉన్నాయి. బంక్‌ల వద్ద స్వచ్ఛమైన తాగునీటి వసతి కల్పించాలి. దీనికోసం బంక్ డీలర్ ఆర్‌ఓఆర్ యంత్రం, వాటర్ కనెక్షన్ కలిగి ఉండాలి. ఏ బంకులోనైనా తాగునీటి వసతి లేకపోతే చమురు మార్కెటింగ్ సంస్థకు ఫిర్యాదు చేయవచ్చు.


రావులపాడు హైవేపై ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంక్


వాహనాలకు ఉచిత గాలి పెడుతున్న సిబ్బంది

మూత్రశాలలు, మరుగుదొడ్లు

స్వచ్ఛ భారత్‌లో భాగంగా అన్ని బంకుల్లో వాహనదారులు, ప్రజల సౌకర్యార్థం శుభ్రతతో కూడిన మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉండాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. వీటిని పలుచోట్ల ఏర్పాటు చేసినా వినియోగదారులను నిర్వాహకులు అనుమతించడం లేదనే విమర్శలు ఉన్నాయి. మరికొన్ని చోట్ల అసలు మరుగుదొడ్లు కనిపించని పరిస్థితి. బంకుల్లో ఎలాంటి సౌకర్యాలు లేకపోతే పెట్రోలియం సంస్థలకు ఫిర్యాదు చేయవచ్చు. లీటరు పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేస్తే అందులో మనం బంక్‌లకు నాలుగు నుంచి ఎనిమిది పైసల వరకు మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణకు చెల్లిస్తున్నాం.

ఆపద వేళ ఫోన్ సదుపాయం

అత్యవసర పరిస్థితుల్లో ఫోన్ వినియోగించుకునే సదుపాయం బంకుల్లో ఉండాల్సిందే. మీరు వెళ్లే మార్గంలో ఏదైనా సమస్యల్లో చిక్కుకుంటే మీ వద్ద మొబైల్ ఫోన్ అందుబాటులో లేకపోతే భయపడాల్సిన పనిలేదు. ఏదైనా పెట్రోల్ బంక్‌ను సందర్శించడం ద్వారా మీరు ఏ నంబర్‌కైనా కాల్ చేసుకోవచ్చు.

నాణ్యతా ప్రమాణాలు తెలుసుకోవచ్చు

పెట్రోల్, డీజిల్ నాణ్యతా ప్రమాణాలు తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉంటుంది. పెట్రోల్, డీజిల్ నాణ్యతా ప్రమాణాలు తెలుసుకునే సదుపాయాన్ని బంకుల యాజమాన్యాలు అందుబాటులో ఉంచాలి. పెట్రోల్, డీజిల్ తక్కువగా వచ్చిందని అనుమానం వస్తే వినియోగదారులు అక్కడికక్కడే పరీక్షించుకోవచ్చు. క్వాలిటీ చెక్ టిష్యూ పేపర్‌నూ యాజమాన్యం అందుబాటులో ఉంచాలి. నోటీసు బోర్డులో సంబంధిత ఆయిల్ కంపెనీ సేల్స్ ఆఫీసర్ నంబర్‌ను ప్రదర్శించాలి.

గాలి ఉచితంగానే..

వాహనాల టైర్లలో గాలి నింపడానికి, గాలి శాతం తనిఖీ చేసుకోవడానికి అనువుగా బంకుల్లో కచ్చితంగా యంత్రాన్ని అందుబాటులో ఉంచాలి. గాలి నింపేందుకు ఒక వ్యక్తిని నియమించాలి. బంకుల్లో పెట్రోలు, డీజిల్ కొనుగోలు చేయకున్నా, వాహనదారులు కోరితే టైర్లలో గాలి తనిఖీ చేయాలి. ఇటీవల వాహనాల టైర్లలో సాధారణ గాలికి, ప్రత్యామ్నాయంగా నైట్రోజన్ నింపుతున్నారు. ట్యూబ్‌లెస్ టైర్లు వస్తున్నాయి. వాటిల్లో నైట్రోజన్ నింపాలి.

ప్రథమ చికిత్స కిట్

ప్రతి బంక్‌లో ఫిర్యాదు పెట్టె, రిజిస్టర్‌ను అందుబాటులో ఉంచాలి. అందులో వినియోగదారులు తమ ఫిర్యాదులను సమోదు చేయవచ్చు. ప్రథమ చికిత్స కిట్ ప్రతి బంక్ వద్ద ఉండాలి. ప్రజలకు అవసరమైనపుడు వాటిని ఉపయోగించుకునే వీలుంటుంది. ఈ ప్రథమ చికిత్స పెట్టెలో ఆరోగ్యాన్ని రక్షించే మందులు ఉండాలి. దీంతో పాటు అన్ని మందులపై గడువు తేదీ రాసి ఉంచాలి. పాత మందులు ఉంచకూడదు.

సరైన అవగాహన లేక..



బంకుల్లో ఉన్న సౌకర్యాలను వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలి. పెట్రోలియం మంత్రిత్వశాఖ అధికారులు దీనికోసం సదస్సులు నిర్వహించాలి. సేవలన్నింటికీ కలిపి చమురు ధరలో వినియోగదారులు చెల్లిస్తున్నా వాస్తవానికి అవి అందుబాటులో ఉండటం లేదు. దీనికి కారణం ప్రజలకు సరైన అవగాహన లేకపోవడమే.

– పడాల రంగారెడ్డి, ఊబలంక

క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక


సమావేశంలో పాల్గొన్న పెయింటర్లు

మలికిపురం: అరుణోదయ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల పెయింటర్ల సర్వసభ్య సమావేశం మలికిపురం పూలే-అంబేడ్కర్ భవనంలో సోమవారం సంఘ కార్యదర్శి నల్లి ప్రసాదరావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పలువురు సభ్యులు మాట్లాడుతూ యూనియన్ అభివృద్ధి కోసం కృషి చేయాలని, సభ్యులంతా సభ్యత్వ నమోదు చేసుకోవాలని పెయింటింగ్ సోదరులంతా కూడా ఐక్యతతో సంఘాన్ని ముందుకు నడిపించాలని సూచించారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా నక్కా శ్రీమన్నారాయణ, అధ్యక్షుడిగా జల్లి ధర్మేంద్ర, ఉపాధ్యక్షుడిగా దొండపాటి ప్రేమ్‌కుమార్, కార్యదర్శిగా పాటి శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా కటికరెడ్డి సత్తిబాబు, కోశాధికారిగా బొక్కా ప్రసాదరావు, గౌరవ సలహాదారుగా బొక్కా రామకృష్ణ ఎంపికయ్యారు.

ఆప్సా ఐకాన్ అవార్డుల స్వీకరణ


ఆప్స ఐకాన్ అవార్డు అందుకుంటున్న బ్లూబెల్స్ ప్రధానోపాధ్యాయిని పద్మావతి

ఆలమూరు: మండలంలోని రెండు ప్రైవేట్ స్కూళ్లకు చెందిన ప్రధానోపాధ్యాయులు ప్రతిష్టాత్మక ఆప్సా(ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్) ఐకాన్ అవార్డులు సాధించారు. ఆలమూరు శివారు కొత్తూరు సెంటర్‌లోని బ్లూబెల్స్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్ అధినేత ఈడ్పుగంటి పద్మావతి, నర్శిపూడిలోని శ్రీవిద్య పబ్లిక్ స్కూల్ అధినేత కామిరెడ్డి గాంధీకి ఈ అవార్డులు దక్కాయి. అందులో భాగంగా ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో అకడమిక్ అచీవర్స్ సెలబ్రేషన్స్‌లో రాష్ట్ర ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్మారెడ్డి కిషోర్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. అవార్డు గ్రహీతలకు ఎంఈఓలు భమిడిపాటి అప్పాజీ, ఎస్.రాజు, ప్రైవేట్ స్కూల్స్ నిర్వాహకులు అభినందనలు తెలిపారు.

ఆకట్టుకున్న దుర్గాదేవి ఊరేగింపు


నర్శిపూడిలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ఆలమూరు: దేవీ శరన్నవరాత్ర, దసరా ఉత్సవాల్లో భాగంగా మండలంలోని నర్శిపూడి దుర్గాదేవి అమ్మవారికి సోమవారం నిర్వహించిన భారీ ఊరేగింపు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. శ్రీదేవీ నవరాత్ర 48వ వార్షికోత్సవాల సందర్భంగా పలు అవతారాల్లో భక్తులకు దర్శనమిచ్చిన దుర్గాదేవికి భక్తులు బ్రహ్మరథం పట్టారు. స్థానిక పడమట వీధి రామాలయం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ బాణసంచా కాల్పులు, తీన్మార్ వాయిద్యాలతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఊరేగిన అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఉత్సవాలను పురస్కరించుకుని ఇంటింటికీ ప్రసాదాలతో పాటు అమ్మవారి కుంకుమ, గాజులను పంపిణీ చేశారు.

వైద్యానికి రూ.15 వేల సాయం


బాధితురాలికి సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న బాధితురాలి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.15 వేల ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు. గ్రామానికి చెందిన లింగోలు సత్యవతి (43) గర్భసంచిలో కణితి వచ్చి క్యాన్సర్‌కి దారితీసింది. ఇప్పటికే రెండు ఆపరేషన్లు చేశారు. అయినా నయం కాలేదు. ఇంకో ఆపరేషన్ చేయాలని డాక్టర్లు చెప్పారు. ఇంకా వైద్యానికి ఖర్చు పెట్టే స్తోమత లేక కాశీ అన్నపూర్ణా దేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. రావులపాలెంలో సత్యవతి ఇంటికి వెళ్లి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.15 వేల చెక్కు సాయంగా అందజేశారు.

ఆవిర్భావ సభకు తరలివెళ్లాలి


సమావేశమైన ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు

మామిడికుదురు: రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 12న విజయవాడలో జరిగే సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని మామిడికుదురులో సోమవారం జరిగిన సమావేశంలో తీర్మానించారు. ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సంఘం జిల్లా జేఏసీ కార్యదర్శి బత్తుల శ్రీనివాస్ మాట్లాడుతూ ఎంటీఎస్ అమలు చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ ప్రకటించాలని, గ్రాట్యుటీ ఇవ్వాలని, ఉద్యోగ విరమణను 62 ఏళ్లకు పెంచాలని, తదితర డిమాండ్లతో విజయవాడలో సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్క సమగ్ర శిక్ష ఉద్యోగి ముందుకు రావాలన్నారు. సమావేశంలో జేఏసీ మండల శాఖ అధ్యక్షులు సిర్రా మణికుమార్, కార్యదర్శి యెరుబండి మధు, మండల పీటీఏ అధ్యక్షుడు గాలిదేవర రామకృష్ణ, సీఆర్పీలు హేమలత, జ్యోతి, పీటీఐలు కళాధర్, ప్రసాద్, వరలక్ష్మి, కృష్ణాజీ పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ బహూకరణ


బడుగువానిలంకలో విద్యార్థిని రమాదేవికి ల్యాప్‌టాప్ బహూకరిస్తున్న ఎన్నారై స్నేహితులు

ఆలమూరు: మండలంలోని బడుగువానిలంకకు చెందిన పేద విద్యార్థిని కోమలి రమాదేవికి సోమవారం ల్యాప్‌టాప్ బహూకరించారు. చెముడులంకలోని జెడ్పీ హైస్కూల్‌లో విద్యను అభ్యసించి అత్యుత్తమ ఫలితాలు సాధించిన రమాదేవి ఉన్నత చదువులకు వెళ్లేందుకు పేదరికం అడ్డువచ్చి చదువు నిలిపివేసింది. బాల్యమిత్రుల ద్వారా రమాదేవి దీనగాధను తెలుసుకున్న మడికి గ్రామానికి చెందిన ఎన్నారై అత్తిలి రమేష్ చలించిపోయాడు. ఆ విద్యార్థిని పూర్తిగా చదివించే బాధ్యతను తీసుకున్నారు. అందులో భాగంగా రమాదేవి చదువు అవసరార్థం తన స్నేహితులైన చిట్టూరి చిట్టిబాబు, చెక్కపల్లి వీర్రాజు, చెల్లుబోయిన వీవీ సత్యనారాయణ, సోదరుడు అత్తిలి వెంకట్రావు ద్వారా ఈ ల్యాప్‌టాప్‌ను అందజేశారు.

హైఓల్టేజీతో గృహోపకరణాల దగ్ధం

మామిడికుదురు: పాశర్లపూడిబాడవ కృష్ణ శర్మ కాలనీలో హై ఓల్టేజీ కారణంగా సోమవారం ఉదయం పలు ఇళ్లలో గృహోపకరణాలు కాలిపోయాయని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు 30 గృహాల్లోని టీవీలు, ఫ్రిజ్‌లు, ఫ్యాన్లు, ఏసీలు, ఇన్వర్టర్లు, స్విచ్ బోర్డులు కాలిపోయాయన్నారు. గాఢ నిద్రలో ఉండగా ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు. దీంతో నిద్రలో ఉన్న వారు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. పిల్లలను తీసుకుని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బయటకు పరుగులు తీశారు. ఎవరికీ ఏమీ కాకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఇక్కడ ట్రాన్స్‌ఫార్మర్ పరిస్థితి ప్రమాదకరంగా ఉందని గతంలో సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదని వాపోయారు. దీనిపై ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.


హైఓల్టేజీతో కాలిపోయిన స్విచ్ బోర్డు

సాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి

ఆలమూరు: తూర్పు డెల్టా ప్రధాన కాలువ పరిధిలోని సాగుభూమి, నీటిపారుదల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తానని ప్రాజెక్టు చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ తెలిపారు. స్థానిక ఇరిగేషన్ శాఖ కార్యాలయంలో డిస్ట్రిబ్యూటరీ, సాగునీటి సంఘ చైర్మన్‌లు, అధికారులతో సోమవారం ప్రత్యేక సమావేశం జరిగింది. సాగునీటి విషయంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్థానిక నేతలు వివరించారు. అనంతరం చొప్పెల్ల, ఆలమూరు లాకులను పరిశీలించారు. లాకుల దుస్థితిపై ప్రభుత్వానికి నివేదికను అందజేసి వాటి అభివృద్ధికి కృషి చేస్తానని తూర్పు డెల్టా ప్రధాన కాలువ ప్రాజెక్టు చైర్మన్ సునీల్‌కుమార్ హామీ ఇచ్చారు. వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకరరెడ్డి, డీసీ చైర్మన్‌లు మెర్ల గోపాలస్వామి, ఎల్.కృష్ణచైతన్య, సుబ్రహ్మణ్యేశ్వర చౌదరి, నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, నీటి సంఘం చైర్మన్ గారపాటి శ్రీనివాస చౌదరి పాల్గొన్నారు.


ఆలమూరులో సాగునీటి సమస్యలపై చర్చిస్తున్న సాగునీటి సంఘ ప్రతినిధులు

ఆక్సిజన్ అసోసియేషన్‌కు ప్రత్యేక అవార్డు


గంగాధరానికి అవార్డు అందజేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

మామిడికుదురు: జిల్లా స్థాయిలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మామిడికుదురు మండలం పాశర్లపూడికి చెందిన స్వచ్ఛంద సేవా సంస్థ ఆక్సిజన్ అసోసియేషన్‌కు ప్రత్యేక అవార్డు అందించారు. అమలాపురంలో సోమవారం జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆర్.మహేశ్‌కుమార్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు కటికిరెడ్డి గంగాధరంకు ఈ అవార్డును అందజేశారు. అసోసియేషన్ సభ్యులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వాండ్రాసి రాజేష్, శివ, తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న ఆదిలక్ష్మి

జిల్లా స్థాయి అవార్డుకు ఎంపికైన ఆదిలక్ష్మి

ఆలమూరు: జిల్లా స్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డుకు మండలంలోని జొన్నాడకు చెందిన 184వ అంగన్వాడీ కేంద్ర టీచర్ గెద్దాడ ఆదిలక్ష్మి ఎంపికయ్యారు. ఈమేరకు అమలాపురంలోని శ్రీసత్యనారాయణ గార్డెన్స్‌లో సోమవారం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ చేతుల మీదుగా ఆమె అవార్డును అందుకున్నారు. జిల్లా స్థాయిలో స్వచ్ఛాంధ్ర అవార్డుకు ఎంపిక కావడంపై కొత్తపేట సీడీఈఓ అధికారి గజలక్ష్మి, సూపర్‌వైజర్లు టీఎస్‌వీ నాగలక్ష్మి, వై.అరుంధతి, బి.వరలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు.

కాన్షీరామ్ వర్ధంతిని విజయవంతం చేయాలి

పి.గన్నవరం: అంబాజీపేట మండలం పుల్లేటికుర్రులో ఈనెల 9న భారీ స్థాయిలో జరగనున్న బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ వర్ధంతిని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జి కొల్లా బత్తుల సత్యం పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన కరపత్రాలను సోమవారం స్థానిక బీఎస్పీ కార్యాలయంలో ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బూసి జాన్‌మోషే, జిల్లా ఉపాధ్యక్షుడు జిత్తుగ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్ల పంపిణీ


కడలిలో వికలాంగులకు అందజేస్తున్న ట్రై సైకిళ్లు

రాజోలు: మిరాకిల్ మినిస్ట్రీస్ అధినేత, కేపీడబ్ల్యూఏ జిల్లా ఫెలోషిప్ అధ్యక్షుడు రెవ.డాక్టర్ వై.శ్రావణ్ కుమార్, సంధ్య కలసి మిరాకిల్ మినిస్ట్రీస్ ద్వారా కడలిలో సోమవారం 10 మంది వికలాంగులకు ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. వర్షానికి, ఎండకు గురి కాకుండా కప్పుతో కూడిన సైకిళ్లను వారు అందజేశారు. ప్రముఖ వ్యాపారవేత్త కుంచే రమణారావు, ఎల్‌ఐసీ ఆఫీసర్ ప్రసాద్, ప్రభుదాసు, సాల్మన్‌రాజు, గోనిపాటి యేసురత్నం, జెఫన్యా, రాజు, రమేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కొత్తపేట: పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని కొత్తపేట నియోజకవర్గ ఫ్యాప్టో పిలుపునిచ్చింది. సోమవారం కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు మండలాల యూటీఎఫ్, ఎస్టీయూ జిల్లా, మండల శాఖల ప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ రోజురోజుకూ ఉపాధ్యాయులపై పెరుగుతున్న ఒత్తిడిని తగ్గించాలని, ఆర్థిక సమస్యలైన నాలుగు డీఏలు ప్రకటించాలని , పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు, యాప్‌ల భారం, సీపీఎస్ రద్దు తదితర హామీలు, వివిధ సమస్యలు పరిష్కరించే విషయంలో ప్రభుత్వం తాత్సారం చేస్తుందని పేర్కొన్నారు. వాటిని వెంటనే పరిష్కరించాలనే డిమాండ్‌తో వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా, వినతిపత్రాలు సమర్పించినా ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. దానిపై రాష్ట్ర ఫ్యాప్టో ఆధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక్ వద్ద మహాధర్నా తలపెట్టామన్నారు. పై డిమాండ్లు పరిష్కరించే వరకు ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు. సమావేశంలో చలో విజయవాడ మండల కోఆర్డినేటర్లు జీవీ రమణ, బండారు నారాయణ, ఎస్టీయూ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఆచంట రామచంద్రప్రసాద్, బండారు శేషు, యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు టీ విజయకృష్ణ, జిల్లా కార్యదర్శి యెలిశెట్టి మురళి, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కేపీసీహెచ్ సూర్యారావు, జీ రామ్‌కుమార్, ఎస్టీయూ నాయకుడు అడపా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అందరూ అవగాహన పెంచుకోవాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జేసీ నిశాంతి, ఆర్‌డీఓ శ్రీకర్

రావులపాలెం: జీఎస్టీ 2.0 పై అందరూ అవగాహన పెంచుకోవాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జేసీ నిశాంతి, ఆర్‌డీవో శ్రీకర్ తదితరులు వ్యాఖ్యానించారు. స్థానిక వేమన రెడ్డి కల్యాణ మండపంలో సోమవారం జీఎస్టీ 2.0 అవగాహన సదస్సు నిర్వహించారు. నాయకులు, అధికారులు జ్యోతి ప్రజ్వలన చేసి అవగాహన సదస్సును ప్రారంభించారు. సదస్సులో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో రకరకాల పన్నులు ఉండేవని, రాష్ట్రానికి, రాష్ట్రానికి ఈ పన్నుల వ్యవస్థ వేర్వేరుగా ఉండేదని, దేశవ్యాప్త పన్ను సంస్కరణల్లో భాగంగా వ్యాట్ వచ్చిందని, ఆ పై దేశమంతా ఒకే పన్ను నినాదంతో జీఎస్టీ వచ్చిందన్నారు. ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీ 2.0 పేద, మధ్యతరగతి వర్గాలతో పాటు రాష్ట్ర ఆర్థికవ్యవస్థకు ఊపు రావడానికి దోహదపడుతుందని అధికారులు జీఎస్టీపై అవగాహన కల్పించారు. అలాగే సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్ కార్యక్రమంలో భాగంగా అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీజేపీ నాయకులు అడబాల సత్యనారాయణ, తమలంపూడి రామకృష్ణారెడ్డి తదితరులు గ్రామంలో పర్యటించి రిలయన్స్ సూపర్ మార్కెట్, యమహా షోరూం, వెంకటసాయి హోమ్ నీడ్స్ షాపుల్లో క్షేత్ర పరిశీలన చేశారు. కొనుగోలు దారులతో మాట్లాడి జీఎస్టీపై అవగాహన కల్పించారు. అలాగే స్థానిక డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు అధ్యక్షతన జీఎస్టీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చార్టర్డ్ అకౌంటెంట్ కొండయ్య విద్యార్థులకు అవగాహన కల్పించారు.

నగరంలో..

మామిడికుదురు: జీఎస్టీ ధరల తగ్గింపు ప్రజలకు ఒక వరం లాంటిదని నగరం సర్పంచ్ జాలెం రమణకుమారి పేర్కొన్నారు. దీనిపై సోమవారం ప్రజలు, వ్యాపారులకు అవగాహన కల్పిస్తూ పగరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యదర్శి కూనపరెడ్డి సురేష్, సచివాలయ ఉద్యోగులు ర్యాలీలో పాల్గొన్నారు. జీఎస్టీ ధరల తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పేద, మధ్య తరగతి వర్గాలకు భరోసా కల్పిస్తూ ప్రభుత్వం జీఎస్టీని నాలుగు నుంచి రెండు శ్లాబులకు తగ్గించిందన్నారు. దీని వల్ల నిత్యావసరాలతో పాటు గృహోపకరణాల ధరలు గణనీయంగా తగ్గాయన్నారు. ఇది ప్రజలకు ప్రభుత్వం అందించిన కానుక అని చెప్పారు. ప్రతి పేద వాడికి ఈ ఫలాలు అందాలని అభిషించారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం


బిళ్లకుర్రులో బాధిత కుటుంబానికి బియ్యం, నగదు అందజేస్తున్న జగ్గిరెడ్డి

కొత్తపేట: మండలంలోని బిళ్లకుర్రులో అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే, జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి బియ్యం, నగదు అందజేశారు. బిళ్లకుర్రు అంబేడ్కర్ కాలనీలో గోడా లక్ష్మి తాటాకింట్లో ఆదివారం అగ్ని ప్రమాదం సంభవించి పూర్తిగా దగ్ధమైంది. ఆ బాధిత కుటుంబాన్ని జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి సోమవారం పరామర్శించి, మానవతా దృక్పథంతో వ్యక్తిగతంగా 25 కేజీల బియ్యం, రూ.5 వేలు అందజేశారు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట జిల్లా పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, రాష్ట్ర పార్టీ ప్రచార కార్యదర్శి ముసునూరి వెంకటేశ్వరరావు, స్థానిక సర్పంచ్ నెల్లి లక్ష్మీపతిరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాకర సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

అంబాజీపేట: ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న ప్రహరీని నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి అన్నారు. నందంపూడి శివారు ముహూర్తాల చెరువుగట్టు వద్ద ఉన్న ప్రాథమిక పాఠశాలలో ప్రహరీ నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేశారు. వారు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి అందరూ తమ వంతు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మోకా ప్రకాష్, ఎంపీటీసీ పద్మావతి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలకు శ్రీధర్ ఎంపిక

అమలాపురం టౌన్: స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల కాకినాడలో నిర్వహించిన స్కేటింగ్ పోటీలో అమలాపురం మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూలుకు చెందిన విద్యార్థి శ్రీధర్ జిల్లాస్థాయిలో విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. స్కూల్లో 9వ తరగతి చదువుతున్న కె.కుమార్‌చందు శ్రీధర్ 100 మీటర్ల స్కేటింగ్ పోటీల్లో బంగారు పతకాన్ని, 300 మీటర్ల పోటీల్లో కాంస్య పతకాన్ని సాధించాడు. త్వరలో రాష్ట్రస్థాయిలో నిర్వహించే పోటీల్లో రాష్ట్రం తరపున శ్రీధర్ తలపడనున్నాడని స్కూలు ప్రధానోపాధ్యాయుడు కె. ఘనసత్యనారాయణ తెలిపారు. పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో విజేత శ్రీధర్‌ను డీఈవో డాక్టర్ షేక్ సలీమ్ బాషా అభినందించారు. వార్డు కౌన్సిలర్ పిండి అమరావతి, స్కూలు పేరెంట్స్ కమిటీ చైర్మన్ మలిశెట్టి వీరాస్వామి, ఉపాధ్యాయులు బీఎస్ వెంకటేశ్వరరావు, రాయుడు శ్రీనివాసరావు, బి.రామకృష్ణ, కేఆర్‌ఎన్ ప్రసాద్ తదితరులు శ్రీధర్‌ను ప్రశంసించారు.


రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికైన శ్రీధర్‌ను అభినందిస్తున్న డీఈవో బాషా

రాష్ట్ర స్థాయి క్రీడలకు విద్యార్థిని ఎంపిక

అయినవిల్లి: మండలంలోని నేదునూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని కాగిత రేష్మా కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో సోమవారం జరిగిన తూర్పుగోదావరి జిల్లా బీచ్ వాలీబాల్ సెలెక్షన్స్‌లో ఎంపికైంది. నేదునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన రేష్మా ప్రతిభ కనబరిచి-14 జిల్లా జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం పీఎస్‌వీవీ ప్రసాదరావు తెలిపారు. ఎంపికైన విద్యార్థి కాగిత రేష్మా, పీడీ శివకుమార్‌ను నేదునూరు సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, ఎంపీటీసీ-1, 2 సభ్యులు కోళ్లపల్లి సుబ్బరాజు, ఇందుగుల వెంకట్రామయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్ పసుపులేటి చంటి, మాజీ చైర్మన్ బండి శ్రీరాములు అభినందించారు.


రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులు